


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 294 ఆదివారం 20-10-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## రెచ్చగొట్టే వారి ఉచ్చులో

# పడకండి

## నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న విపక్షాలు

- వారి హయాంలో ఉద్యోగాలు ఇవ్వలేదు
- ఇప్పుడేమో ఆందోళనతో అడ్డం పడుతున్నారు - గ్రూప్-1 పరీక్షలు యధాతథంగా సాగతాయి
- మీకు ఉద్యోగాలు కల్పించాలన్నదే మా లక్ష్యం - సిఎం రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టీకరణ



**తొలి సమయం హైదరాబాద్,**
బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లపాటు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇప్పుడేమో పోటీ పరీక్షలను వాయిదా వేయాలని అంటోందని అన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'పరీక్షలకు సిద్ధం కండి. 95శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారు. మరో 5శాతం మంది డౌన్లోడ్ చేసుకోండి. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మకండి. వారు చేయరు..ఇప్పుడున్న ప్రభుత్వం చేయకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మేం వచ్చాకే వేల ఉద్యోగాలు కల్పిస్తున్నాం' రేవంత్ పేర్కొన్నారు. 'తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశాం. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించాం. 1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందాలని కొందరు చూస్తున్నారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 564 గ్రూప్ వన్ పోస్టుల నియామకాల కోసం మెయిన్స్ పరీక్షను సోమవారం నిర్వహించబోతున్నం. ప్రతిపక్షాల ఉద్యోగాలు పోయాయి. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. గతంలో ఉన్న జీఓ 55 రద్దుచేసి గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చాం. అదే సమయంలోనే జీఓ 29 తెచ్చాం. ఈ జీవో ద్వారా రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించాం. 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు 1:100 లెక్కన పిలవాలి అని ఆందోళన చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను మధ్యలో మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా అని ప్రశ్నించారు. నోటిఫికేషన్ ఇచ్చే సమయంలోనే 1:100 కోరుకుని ఉంటే మీ ఆలోచనకు తగ్గట్టే ఇచ్చేవాళ్లం అన్నారు. నోటిఫికేషన్లు రద్దయి, యువత రోడ్డుమీద పడితే ఆలోచించే వారిని దూరం పెట్టాలని అన్నారు. రిజర్వేషన్ ప్రకారమే సెలెక్ట్ చేస్తే వేలమంది ఎస్సీ, ఎస్టీలకు అవకాశం వచ్చింది. రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేస్తుంటే కొంతమంది గందరగోళం సృష్టిస్తూ ఉన్నారు. 10 ఏళు అధికారంలో ఉన్నప్పుడు కనీసం మీకు అపాయింట్మెంట్ అయినా ఇచ్చారా..? ప్రజా యుద్ధనౌక గద్దర్ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే నాలుగు గంటలపాటు ఎండలో నిల్చోబెట్టిన నీచమైన చరిత్ర వాళ్లది. గ్రూప్ 1 హాల్ టికెట్లు 95 శాతం మంది తీసుకున్నారు.. ఇంకా తీసుకొని వారు హాల్ టికెట్లు తీసుకొని పరీక్షకు సన్నద్ధంకండని సిఎం సూచించారు. న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని సమర్థించాయి. మీ భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. వారి ఉచ్చులో పడకండి. ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంది. అన్నగా నేను పరీక్షలు నిర్వహిస్తుంటే, వద్దు అని ఆందోళన చేస్తున్నారు ఆలోచించండి. మీకు అవకాశాలు ఇవ్వడం కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆందోళనలను విరమించి అపోహాలకు దూరం కండి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు ఉదారంగా వ్యవహరించండి. నిరుద్యోగులపై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు.. పొరపాటున కేసులు పెడితే ఉద్యోగాలు సాధించడంలో ప్రతిబంధకంగా మారుతాయి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న క్రమంలో కేసులు పెట్టవద్దని పోలీసులను ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## మరోమారు రోడ్డెక్కిన

# గ్రూప్-1 అభ్యర్థులు

### ఆందోళనకు బండి సంజయ్ తదితరుల మద్దతు

**చలో సెక్రెటరియట్‌ను అడ్డుకున్న పోలీసులు**

**బండి సంజయ్ అరెస్ట..బిజెపి అఫీస్‌కు తరలింపు**



**తొలి సమయం హైదరాబాద్,** గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు శనివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి నిరసనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఛలో సెక్రెటేరియట్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళన కాస్త తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్రెటేరియట్‌కు వెళ్లి తీరతామని బండి సంజయ్ స్పష్టం చేశారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రెటేరియట్‌కు బయలుదేరిన బండి సంజయ్‌ను తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై బండి సంజయ్ మండిపడ్డారు. మరోవైపు ఆందోళన చేస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే శుక్రవారం ఆందోళనను అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్ళాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు. కాగా.. గ్రూప్ వన్ మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మరోవైపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలైన విషయం తెలిసిందే. ÷నైల్ కీలో తప్పులు ఉండటంతోపాటు వివిధ కారణాలతో ప్రాథమిక పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. చివరి నిమిషంలో పరీక్ష రద్దు సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిపోయినట్లైంది.

## దేశ భవిష్యత్‌ను నిర్ణయించే

# మహా ఎన్నికలు

**దేశరాజకీయాలను ఈ ఫలితాలు మరుస్తాయన్న అఖిలేశ్**

**మహా వికాస్ అఘాడీ పొత్తులో ఎస్పీకి 12 సీట్లు**



**ముంబయి,అక్టోబర్ 19:** మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లుగా సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీకి బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ధూలే నగరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పార్టీలను విభజించి.. అధికారాన్ని దొంగిలించిందని అఖిలేష్ దుయ్యబట్టారు. అసెంబ్లీకి విద్యావంతులైన ఎమ్మెల్యేలను పంపడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. 'మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఉండదు. దీంతో దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్‌లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు' అని అఖిలేష్ జోస్యం చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను, దాని మిత్రపక్షాలను ఓడించి.. తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తోందని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# వైద్యులారా ఆందోళన విడనాడండి

**ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రండి**

**మరోమారు చర్చలకు ఆహ్వానించిన సిఎం మమత**



**కోల్‌కతా,అక్టోబర్ 19:** కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యారోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3-4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. ఈ విషయంపై చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలు డిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయాలను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశిరచడం సరికాదని వ్యాఖ్యానించారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో పాల్గొన్న పలువురు అనారోగ్యానికి గురవుతుండటంతో సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జాతీయ మహిళా కమిషన్ పునర్వ్యవస్థీకరణ

- కొత్త చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహాట్కార్
- ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్ - మూడేళ్లపాటు పదవిలో కొనసాగేలా ఉత్తర్వులు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 19:** జాతీయ మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహాట్కార్ ను కేంద్ర ప్రభుత్వం శనివారంనాడు నియమించింది. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ యాక్ట్- 1990లోని సెక్షన్ 3 కింద ఈ నియామకం జరిపినట్టు ఒక నోటిఫికేషన్‌లో కేంద్రం తెలిపింది. ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. రహట్కార్‌తో పాటు ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్‌ను కూడా కేంద్రం నియమించింది. మజుందార్ నియామకం కూడా మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఎన్‌సీడబ్ల్యూ 9వ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తు?న్న విజయా రహట్కర్ దీనికి ముందు మహారాష్ట్ర స్టేట్ కమిషన్ ఫర్ ఉమెన్ చైర్‌పర్సన్‌గా 2016-2021 వరకూ సేవలందించారు. పోక్సో, యాంటీ ట్రిపుల్ తలాక్ చర్యలు, యాంటీ ఉమన్ ట్రాఫికింగ్ యూనిట్ల వంటి అంశాలపై చట్టపరమైన సంస్కరణలపై కీలకంగా దృష్టి సారించారు. డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను ప్రమోట్ చేశారు. వీటికి తోడు నాయకత్వ ప్రతిభను కూడా ఆయన చాటుకున్నారు. నేషనల్ యూత్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షురాలిగా, మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఏడళ్లు పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్రటరీగా ఉన్నారు. 2007 నుంచి 2010 వరకూ ఛత్రపతి సంభాజీనగర్ మేయర్‌గా సేవలందించారు. హెల్త్‌కేర్, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టు విషయంలో కీలకంగా వ్యవహరించారు. ఇంటర్నేషనల్ కల్చరల్ సెంటర్‌గా సిటీని అభివృద్ధి చేసేందుకు, టూరిజం పోత్సాహానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్-గవర్నమెంట్ అడ్వయిజరీ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. మహిళా సాధికారతకు చేసిన కృషికి పలు అవార్డులు అందుకున్నారు.

# విచ్చలవిడిగా బెల్టు దందా

## ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు

**- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు - నెలవారి మామూళ్ల మత్తులో ఆఫీసర్లు**

**- పేరుకే కిరాణాలు..గుట్టుగా మద్యం బిజినెస్**



**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 19:** టేకుమట్ల మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి కలిగిన రెండు వైన్ షాపులున్నాయి. అయితే మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాప్ నిర్వాహకుల దూకుడు మామూలుగా లేదు. ఉదయం 5 గంటలకే మొదలై..రాత్రి ఒంటిగంట వరకు బెల్ట్ షాపుల్లో మద్యం లభించడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతాయి. కానీ బెల్ట్ షాపుల్లో మాత్రం నిరంతరం మద్యం లభించడం గమనార్హం. గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో ఏ మధ్య రాత్రి అయినా తలుపు తట్టితే క్షణం ఏటీఎం లాగా కావాల్సిన మద్యం లభిస్తుంది.

**పేరుకే కిరణాలు..అమ్మేది మద్యం**

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ..లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు వైన్ షాప్ యజమానులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపులకు ఒక మద్యం దుకాణం, కస్టమర్లకు మరో మద్యం దుకాణం చొప్పున కేటాయించి బెల్ట్ షాపులకు కేటాయించిన మద్యం షాపులో బెల్ట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో ఇంకా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నప్పటికీ, రాత్రనక, పగలనక మద్యం దొరుకుతుండడంతో..మద్యం ప్రియులు మద్యాన్ని విపరీతంగా తాగుతూ మద్యం మత్తులో ఇంట్లో గొడవలు పెట్టుకుంటూ అర్ధరాత్రి వరకు నానా రభసే సృష్టిస్తున్నారని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామాల్లోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాప్ ల కారణంగా ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతుంది.

**సంసారాల మద్యం చిచ్చు**

విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు చెలరేగుతుందని, గ్రామాల్లో అధికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కనుసన్నల్లోనే బెల్టు షాపులు..?**

మండల వ్యాప్తంగా ప్రతి నెల బెల్ట్ షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్ షాప్ యజమానులు, ఎక్సైజ్ పోలీస్ అధికారుల అండదండలతో గ్రామ, గ్రామాన వైన్ షాపులను తలపించే విధంగా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ..దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అధిక ధరలకు విక్రయాలు**

మండల కేంద్రంలో ఉన్న మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయాలు జరగాల్సి ఉండగా..మద్యం షాప్ యజమానులు సిండికేట్ గా ఏర్పడి కస్టమర్ల కోసం ఏర్పాటు చేసిన వైన్ షాపులో బ్రాండెడ్ మద్యంతో పాటు బీర్లను అమ్మకపోవడం, చీప్ లిక్కర్లను అమ్మడం ఒకవైపు అయితే..బెల్ట్ షాప్ ల కోసం కేటాయించిన మద్యం షాపులో మాత్రం బ్రాండెడ్ మధ్యాన్ని అధిక ధరలకు బెల్ట్ షాపులకు విక్రయించడం వలన..మద్యం ప్రియులు బెల్ట్ షాప్ లను ఆశ్రయించి మరింత అధిక ధరలకు మద్యాన్ని కొనుగోలు చేసేలా వైన్ షాప్ యజమానులు ప్లాన్ చేశారు. ఈ ప్లాన్ వర్కౌట్ అవడంతో ఈ మద్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. దీంతో మందుబాబుల జేబుకు చిల్లు పడుతుంది. ఇంత దందా జరుగుతున్న సంబంధిత అధికారుల దృష్టికి రావడం లేదా..? వచ్చిన చర్యలు తీసుకోవడం లేదా..? అని ప్రజలు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను తొలగించాలంటూ మహిళలు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. కూలి నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలు పనిచేసి వచ్చి అలసటతో వారికి అందుబాటులో లేని మద్యం తాగడం ఎందుకని గతంలో ఇండ్లలో ఉండేవారు. కానీ గ్రామాల్లో ఇప్పుడు బెల్ట్ షాపుల వలన కూలి కూలి పని చేసి వచ్చిన డబ్బుతో కుటుంబ యజమాని వచ్చిన డబ్బును మద్యానికి ఖర్చు చేసి ఇంటికి భారమవుతున్నారని, మద్యాన్ని సేవించడం వల్ల ఎందరో ఆడపడుచులు తాళిబొట్లను పోగొట్టుకొని వెధవలుగా మారారని..ఆ పాపం ఈ మద్యం దందా చేసే వ్యక్తులపై మరియు ఈ మద్యం దంధాను అరికట్టలేని అధికారులకు తాకుతుందని ప్రజలు శపిస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీని విచ్చిన్నం చేసేందుకు అగ్రవర్ణ వలసవాదుల కుట్ర

**- బిసి మహిళా మంత్రి కొండా సురేఖమ్మపై తప్పుడు ఆరోపణలతో ఇబ్బందులు**

**- కొండా సురేఖమ్మకు అండగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం**

**- కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి 19:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విచ్చిన్నం చేసేందుకు వేరే పార్టీ నాయకులతో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీలో చేరిన అగ్రవర్ణ వలసవాదులు కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే బీసీ మహిళా మంత్రి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా ఫైర్ బ్రాండ్, ఓరుగల్లు రుద్రమదేవిగా పేరు ప్రఖ్యాతులు గాంచిన కొండా సురేఖమ్మపై తప్పుడు ఆరోపణలతో ఇబ్బందులు పెడుతున్నారని, ఇట్టి విషయాన్ని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొండా సురేఖమ్మకు అండగా ఉండి, కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అన్నారు. శనివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీగా, ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీలో ప్రస్థానం మొదలుపెట్టిన కొండా సురేఖమ్మ ప్రజాదారణను చూసి ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆమెకు శాయంపేట ఎమ్మెల్యేగా టికెట్ ఇస్తే గెలిచి ప్రజాసేవకురాలిగా, నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ..వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేశారని కుమారస్వామి తెలిపారు. అలాగే డి లిమిటేషన్ లో భాగంగా శాయంపేట నియోజకవర్గం విడిపోవడంతో పరకాల నుంచి పోటీ చేసి వైయస్సార్ మంత్రివర్గంలో మంత్రిగా చోటు సంపాదించుకొని వరంగల్ అభివృద్దే లక్ష్యంగా పనిచేశారన్నారు. వైయస్సార్ మరణంతో ఆయన మీద ఉన్న అభిమానంతో మంత్రి పదవికి రాజీనామా చేసి ఆయన మీద ఉన్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. దీంతో నమ్మిన వారి కోసం ఎంత దూరానికైనా, పదవుల త్యాగాలకైనా సిద్ధపడే కుటుంబం కొండా కుటుంబమని నిరూపించుకున్నారన్నారు. మళ్లీ వరంగల్ తూర్పు నుంచి రెండు పర్యాయాలు గెలుపొందిన సురేఖమ్మ ఉమ్మడి ఓరుగల్లు జిల్లా ప్రజలకు ఆపదొస్తే ఆదుకునే అమ్మగా, ఓర్పులో భూమాతగా, గుణంలో సీతాదేవిగా, రూపంలో పార్వతి దేవిగా, కొండా దంపతుల అభిమానులకు ఆపద సృష్టించే వారిపట్ల కాళికామాతగా పేరు ప్రఖ్యాతులు గాంచి తెలుగు రాష్ట్రాల్లో అభిమానులను, భక్తులను సంపాదించుకున్న ఏకైక కుటుంబం కొండా కుటుంబమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఓరుగల్లు జిల్లాతో పాటు..వివిధ నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో కొండా అభిమానులు ఉంటారని, వారి పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కొండా యువసేన నాయకులు పనిచేస్తారని తెలిపారు. పార్టీ పట్ల క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కొండా సురేఖమ్మ రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చేరినప్పటి నుండి కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరిన అగ్రవర్ణ వలసవాదులు వేరే పార్టీ నాయకులతో కలిసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇలాంటివి ఇకనుండి సహించేది లేదని ఆకుతోట కుమారస్వామి హెచ్చరించారు.

# విశాఖ శారదపీఠానికి సర్కార్ ఝలక్

**- గత ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాలు రద్దు - సంచలన నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం**

**అమరావతి,అక్టోబర్ 19:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న విశాఖపట్నంలోని శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతికి చంద్రబాబు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. గత ప్రభుత్వం విశాఖపట్నంలో ఈ పీఠానికి 15 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందుకు సంబంధించిన అనుమతులను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో శారదా పీఠానికి 15 ఎకరాలను కేటాయిస్తూ గత జగన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ స్థలం విలువ రూ. 220 కోట్ల ఉంటుందని ఆరోపణలు వచ్చాయి. నాటి జగన్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్ర ఆరోపణలు సైతం వ్యక్తమైన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర ఓటరు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. దీంతో ఆంధప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు, అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. అందులోభాగంగా గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను రద్దు చేసింది. అందులోభాగంగా శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతికి కేటాయించిన స్థలానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది. ఈ అనుమతులకు సంబంధించిన రద్దు ఉత్తర్వులు సోమవారం వెలువడే అవకాశముందని సమాచారం. 2014 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా పరిమితమయ్యారు. ఇక 2019 ఎన్నికల్లో అధికారం పీఠం అందుకునేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఆ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర సైతం చేశారు. అందులోభాగంగా తాను హిందువుననే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అలా విశాఖలోని శారదాపీఠం శ్రీశ్రీశ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి దోస్తి కుదిరింది. ఆయనతో కలిసి తిరుమల శ్రీవారిని సైతం వైఎస్ జగన్ చేసుకున్నారు. ఇక 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ 151 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికల ఫలితాలపై స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సైతం స్పందించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం చాలా ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఆ తర్వాత.. విశాఖలోని శారదాపీఠానికి నాటి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులే కాదు... ఉన్నతాధికారులు సైతం క్యూ కట్టారు. అయితే గతంలో విశాఖపట్నం నగర శివారులో ఈ శారదా పీఠం ఉండేది. ఇక జగన్ ప్రభుత్వం.. ఈ శారదా పీఠానికి 15 ఎకరాలు కేటయించింది. ఈ కేటాయింపులపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. అలాగే తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం హైదరాబాద్ నగర శివారులో విలువైన భూములను శారదా పీఠానికి కేటాయించారు. ఈ వ్యవహారంపై కూడా ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఈ శారదా పీఠాధిపతి ఆధ్వర్యంలో మరోసారి అధికారం కోసం కేసీఆర్ యాగం సైతం నిర్వహించిన సంగతి తెలిసిందే.

# చేరికలతో జనసేనపై విశ్వాసం పెంచింది : జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి

**అమరావతి,అక్టోబర్ 19:** జనసేనలో చేరికలు తమపై విశ్వాసాన్ని మరింత పెంచాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముద్రగడ క్రాంతి, గుంటూరుకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, నలుగురు జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్లు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామినేని ఉదయభానుపై నమ్మకం ఉంచి ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్‌శాఖ పనిచేస్తోంది. అవినీతికి ఆస్కారంలేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూపాయి లంచం లేకుండా, ఎవరి సిఫారసులు లేకుండా బదిలీలు జరిగాయి. కూటమి ఎమ్మెల్యేలు సిఫారసు చేసినా క్షుణ్ణంగా పరిశీలించి బదిలీలు చేశాం. లంచం అనే పదం వినిపిస్తే కార్యాలయం నుంచి వెళ్లిపోవాల్సిందే. గుడివాడ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని మా దృష్టికి రాగానే చర్యలు చేపట్టాం. ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేసి.. నీటి పరీక్షలు నిర్వహించాం. నిధులు మంజూరు చేశాం. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలు తీర్చటం కోసం సిద్ధంగా ఉన్నాం' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకము" నకు యస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 19 :** 2024-25 వ, విద్యా సంవత్సరమునకు గాను తెలంగాణ ప్రభుత్వం విదేశీ విధ్యాలయములల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహించ బడుచున్న "అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకము" ద్వారా షెడ్యుల్డ్ కులములకు చెందిన విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ అందించుటకు నిర్ణయించడమైనదని, యు. యస్.ఎ, యు కె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మని, జపాన్, సౌత్ కొరియా న్యూజిలాండ్ విశ్వ విద్యాలయములల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సులల్లో చదువాలనుకుంటున్న యస్సీ విద్యార్థుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.నర్మద నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

**అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకము కొరకు చివరి తేది: 29-10-2024**

కావున జిల్లాలోని అర్హులైన యస్సీ విద్యార్థులు ఈపాస్ వెబ్ సైట్లో www.telangana. epass.cgg.gov.inలో ధరఖాస్తు చేసుకోవాలని, నిర్దిష్టమైన ఫార్మాట్లో అవసరమైన డాక్యుమెంట్లతో విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ఈ పథకం నకు సంబంధించిన పూర్తి వివరాలు ఈపాస్ వెబ్ సైట్లో లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

## మామిడి సాగులో సస్య రక్షణ చర్యలు

**మేలైన యాజమాన్య పద్దతులు పాటించాలి**



**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 19 :** శనివారం జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న మరిపెడ, మహబూబాబాద్, నర్సింహులపేట తదితర మండలాలో సాగులో ఉన్న మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో మామిడి సాగును 13,006 ఎకరాలలో సాగు చేస్తున్నారని, మామిడి తోటలు ప్రస్తుతం ఇగురు, కొమ్మ దశలో వున్నాయని, మామిడి తోటలు ప్రతి సంవత్సరం కాపు కాయడానికి జులై-ఆగస్టు మాసాలలో కొమ్మ కత్తిరింపులు చేయాలని, ముదురు తోటలైతే పునరుద్ధరణ చేయాలని రైతులకు సూచించారు. జూలై-ఆగస్టు మాసంలో దుక్కి దున్ని సిఫారసు చేసిన మోతాదులో సేంద్రియ, రసాయన ఎరువులు వేయాలని, పచ్చి రొట్ట ఎరువులు కూడా వేసి పూత సమయంలో కలియదున్నాలని మామిడి తోటలు త్వరలో మొగ్గ దశకు చేరుకొని పూతకు వచ్చే అవకాశం ఉంది కనుక లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారి చేయాలని,మామిడి తోటలను ఆకుగూడు పురుగులు ఆశించి తోటను నష్టం చేస్తున్నాయని, నివారణకు లీటర్ నీటికీ రెండు మిల్లీ లీటర్ల క్లోరోపైరీఫాస్ ం ఒక మిల్లీ లీటర్ కరాటే కలిపి కాండం తో సహా చెట్టు మొత్తం తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు.చెట్టు చుట్టూ నేల మీద కూడా పిచికారి చేయాలని, పిచికారి చేసే ముందు కర్ర సహాయంతో గూళ్ళు అన్ని తీసివేసి పిచికారి చేయాలన్నారు.లేనిచో ఈ పురుగు వచ్చే మొగ్గలను, పూతను తినేస్తుందని అన్నారు.క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం కొమ్మ కత్తిరింపులు, పునరుద్ధరణ, మల్చింగ్, సేంద్రియ పద్దతులు, బిందు సేద్యంతో నీటి సరఫరా, ఫర్టిగేషన్ ద్వారా ఎరువులు ఇవ్వడం, పచ్చి రొట్ట వాడకం, అధిక సాంద్రతలో మొక్కలు వేయటం, ఎత్తు మడుల పద్దతి పాటించడం, మార్కెట్ డిమాండ్ ఉన్న రకాలైన హిమాయత్, కేసరి, అల్ఫాన్సో వంటి పండు రకాలు, పచ్చడి రకాలు, నూతన రకాలు సాగు చేయాలని రైతులను కోరారు.

## పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో జరిగిన సంఘటనపై సిపి పూర్తి విచారణ చేయాలి

**బాధిత కుటుంబాని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్**




**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 19**

శనివారం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు.నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ, పాలకుర్తి పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటనను వెంటనే వరంగల్ సి పి పూర్తి విచారణ చేసి స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు, అదేవిధంగా బాధిత కుటుంబానికి వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం, ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా సెక్రటరీ గండి మురళి, జాయింట్ సెక్రెటరీ ధర్మేశ్వరరావు, మోయిన్ పాషా, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వాణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు,

## ప్రజల ప్రాణాల ను కాపాడుతున్న పోలీసులను అభినందించిన హ్యూమన్ రైట్స్ టీం సభ్యులు

**ఎస్సై గుండ్రాతి సతీష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నేషనల్ హ్యూమన్ రైట్స్ టీం సభ్యులు**



తొలి సమయం కురవి అక్టోబర్ 19: జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ తరపున ఈరోజు కూరవి మండలం ఎస్సైగా పనిచేస్తున్న గంద్రతి సతీష్ మర్యాదపూర్వకంగా ఉమెన్ రైట్స్ మండల డిస్టిక్ కమిటీ సభ్యులు కలిశారు సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో భారీ వర్షాల వల్ల ప్రజలను రక్షించుటలో పోలీసుల పాత్ర మరువలేనిది అని అన్నారు, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు సెల్ ఫోను మాట్లాడకుండా ఉండాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని వీటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు పోలీసులు సూచించే సూచనలు,సలహాలు, జాగ్రత్తలు క్రమశిక్షణ చర్యలు ప్రజలు విద్యార్థులు వాహనదారులు పాటించాలని అన్నారు, కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ గండి మురళి జాయింట్ సెక్రెటరీ ధర్మేశ్వరరావు కురవి మండలం మోయిన్ పాషా, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వాణి సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీకోర్టులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలి

## ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఉయిక శంకర్



**తొలి సమయం, వెంకటాపురం, అక్టోబర్ 19**

నూగురు వెంకటాపురం మండల కేంద్రంలో ఏజెన్సీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలనీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఉయిక శంకర్ పత్రిక ప్రకటనలో జిల్లా అధికారులను కోరారు. ఈ సందర్భాగా అయన మాట్లాడుతూ ఏటూర్ నాగారం ఐటిడిఏలో ఏజెన్సీ ఎస్ డి సి నిర్వహించక పోవడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆవేదన చెందారు. ఎస్ డి సి నిర్వహించి ప్రభుత్వ భూములను కాపాడాలని జిల్లా కలెక్టర్, ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారిని ప్రకటనలో కోరారు. ఏజెన్సీ మండలాల్లో తహసీల్దార్ లకు 1/70 చట్టం ,పెసా చట్టం పై అవగాహన లేకపోవడంతో చట్టాల విరుద్దంగా గిరిజనేతరులకు ప్రభుత్వ భూములను పట్టాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంకటాపురం మండలకేంద్రంలో గ్రామ కంఠాల భూములు నేటికి 1/70 చట్టం విరుద్దంగా క్రయ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ దారుల పై ఎల్ టి అర్ కేసులు నమోదు చేయాలనీ డిమాండ్ చేసారు. అక్రమ బహుళ అంతస్తుల పై చర్యలు తీసుకోవాలని పంచాయితీ,రెవిన్యూ అధికారులను ప్రకటనలో కోరారు. ఏజెన్సీ ఇసుక పాలసీ విధానానికి విరుద్దంగా రేజింగ్ కాంట్రాక్టర్ లు ఏజెన్సీ సంపదను దోచుకుంటున్నారని ,జిల్లా అధికారులు చర్యలు తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని ఆగ్రహించారు. రేజింగ్ కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఇసుక రిచ్ లు ఐ టి డి ఏ ద్వారానే నిర్వహించేలా అధికారులు ఇసుక పాలసీ రూపొందించాలని కోరారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇసుక పాలసీ విధానం,భూమాత పై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందచేయనున్నట్లు తెలిపారు. గ్రామా కంఠాలు ఆక్రమన జరుగుతున్నాయని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలు పునిచ్చారు. ఆదివాసీ ఉద్యమాల ద్వారానే హక్కులు చట్టాలు అమలుకు నోచుకుంటాయని ,ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని పిలు పునిచ్చారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలను మరువద్దు

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ






**తొలి సమయం, వరంగల్, అక్టోబర్ 19**

శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణాలర్పించి పోలీసు అమరవీరులను ప్రజలు మరువద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకోని పోలీసులు క్రోవ్వోత్తుల ర్యాలీని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అశోక జంక్షన్ నుండి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము వరకు నిర్వహించిన ఈ ర్యాలీలోని వారు పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ములోని అమర వీరు స్థూపం వద్ద చేరుకోని అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడు తూ నక్సలైట్ల చేతుల్లో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృధాపోవని, వారి త్యాగాల ద్వారా నేడు ప్రశాంత వాతవరణం నెలకొందని, అలాగే అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేది నుండి 31 తారీఖు వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా పోలీస్ కమిషనర్వెల్లడించారు. ఈ కార్యక్రమములో డిసిపిలు రవీందర్ , అదనపు డిసిపిలు సంజీవ్, సురేష్ కుమార్, రవితో పాటు ఏసిపిలు, ఇన్స్ స్పెక్టర్లు , ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది,పోలీస్ అమర వీరుల కుటుంబం సభ్యులు, జాగృతి కళా బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.





# కక్షసాధింపు కేసులతో మసకబారుతున్న ప్రభ !

**తొలి సమయం, హైదరాబాద్,**

రాజకీయ అవినీతిపై మోడీ తన పదేళ్ల పాలనలో ఒక్క నేతపైనా కేసును రుజువు చేయించలేక పోయారు. కేవలం విచారణలు, జైళు ,, బెయిళ్లు లాగా కథ నడుస్తోంది. మొన్నటికి మొన్న ఆప్ నేత సత్యేంద్ర జైన్ దాదాపు రెండేళ్ల తరవాత జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకుముందు సిసోడియా, కేజ్రీవాల్, కవిత, హేమంత్ సోరెన్ వంటి వారు కూడా బెయిల్‌పై వచ్చారు. ఈ అందరిలో ఒక్కరిపైనా కేసులు రుజువు కాలేదు. దీనినిబట్టి ఇడి, సిబిఐల సమర్థతపైనా అనుమానాలు వస్తున్నాయి. అంతేగాకుండా ఇవన్నీ కూడా కేవలం రాజకీయ కక్షసాధింపు కేసలుగానే ప్రజలు ఆలోచిస్తున్నారు. నిజానికి అవినీతి కేసుల్లో నిక్కచ్చిగా వ్యవహరించడడం లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఎపిని అడ్డగోలుగా ఐదేళ్లు పాలించి, అక్రమాలకు పాల్పడ్డా కేసులు లేకుండా పోయాయి. కెసిఆర్ కుటుంబం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డా కనీసం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇలా నేతల అవినీతిపై ఆరోపణలు చేసింది సాక్షాత్తు ప్రధాని మోడీయే. అయినా అవి విచారణకు నోచుకోలేదు. ఒక్కరు కూడా శిక్షార్హులు కాలేదు. దీనికంతటికీ కేసుల్లో బలం లేకపోవడం లేదా చిత్తశుద్ధి లోపించడం వటంటి కారణాలు కావచ్చు. రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. అవినీతిని దునుమాడాల్సిందే. నీతిమాలిన పనులు చేయకుండా చూసుకోవాలి. అవినీతికి పాల్పడే నేతలను శిక్షించాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. కానీ జరుగుతున్న తంతు చూస్తుంటే.. అందుకు భిన్నంగా ఉంది. రామరాజ్యం పేరుతో..ప్రవచనాలు పలికిన ప్రధాని మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పూర్తి పక్షపాతంగా ఉంటున్నాయి. కేజ్రీవాల్, సిసిఓడియా, సత్యేంద్ర జైన్, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్ లాంటి వారిని వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరుతో ఒరిగిందేమీ లేదు. కేసుల్లో బలం లేకపోవడం, రుజవులు సంపాదించకపోవడం, కేవలం వేధింపు చర్యగానే చూడాలి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులుగా రాజ్యమేలిన కెసిఆర్, జగన్‌లను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపైనా, కూతురు కవితపైనా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. కవితను అరెస్ట్ చేసి జైలులో పెట్టినా కేసు నిలబడలేదు. దీంతో ప్రజలే తీర్పును ఇచ్చారు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి అవినీతికి పాల్పడ్డ కెసిఆర్, జగన్‌లను అధికారానికి దూరం చేశారు. ఐదేళ్లపాటు ఎపిలో జగన్ బెయిల్‌పై ఉన్నా మోడీ పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం అలా జరగలేదు. మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రినే అరెస్టు చేయించింది. ఢిల్లీ, జార్ఖండ్‌లలో సిఎంలను అరెస్ట్ చేయించి మోడీ చరిత్ర సృష్టించారు. ఈడీ చర్యల కారణంగా దానికి ఉన్న ప్రతిష్ట దిగజారింది. సిబిఐ ప్రతిష్టా దిగజారింది. ఈ రెండు సంస్థలు దర్యాప్తులో పెద్దగా పురోగతి సాధించలేక పోతున్నాయి. ఎపిలో వైఎస్ వివేకనందరెడ్డి హత్య కేసును ఛేదించలేక పోయారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాము, తమ కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేదనను ఎదుర్కొన్నామనీ కేసులు ఎదుర్కొన్న నేతలు వ్యాఖ్యానించారు. ఇకపోతే కెసిఆర్, జగన్‌లకు లేని వేధింపులు జార్ఖండ్‌లో సోరేన్‌కు మాత్రమతప్పలేదు. ప్రజలు ఇలాంటి దర్యాప్తులపై ఆలోచించాలి. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. తాజాగా సిబిఐ, ఈడీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తోంది. . నిజానికి కుంభకోణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిక్షకు గురి కావాల్సిందే. కానీ కొందరిని మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గూటిలో లేని వారికే వేధింపులు రావడం గమనించవచ్చు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల నేతలు చేస్తున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకుప్పగా చేసి,దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విషయంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవరినీ వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఎందుకంటే కవిత జైలుకు వెళ్లడం, బెయిల్‌పై రావడం తప్ప దర్యాప్తులో పురోగతి లేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభుత్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చేయడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తానని బహిరంగ సభల్లో ప్రకటించారు. అవినీతిపరులను జైలుకు పంపిస్తామని ప్రకటించిన మోదీ ప్రాజెక్టుల్లో అవినీతి, నిరుద్యోగం, ధరణి పేరిట అక్రమాలు, ఫామ్ హౌజ్‌లో విశ్రమించడం, మూఢ నమ్మకాలు వంటి అనేక అంశాలను తెలంగాణలో నాటి సిఎం కెసిఆర్ విషయంలో ప్రస్తావించారు. కానీ ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనన్న ప్రచారం ఇప్పటికీ సాగుతోంది. ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదు. ఇప్పటికైనా సిబిఐ,ఇడిలను పటిష్టం చేయాలి. రాజకీయాలకు దూరంగా స్వతంత్రంగా అవి పనిచేసుకునేలా చేయాలి. అప్పుడే అవినీతి నేతలకు వణుకు పుడుతుంది.


# వచ్చే నెలలో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

**తిరుచానూరు,అక్టోబర్19:** శ్రీవారి పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయి. నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 వరకు జరిగే శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుచానూరు ముస్తాబు అవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన టిటిడి పనుల్లో నిమగ్నమైంది. ఈ మేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లను టిటిడి జెఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటసాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలా టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమి తీర్థం లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, పూడి రోడ్డులోని గోశాల వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అర్థం అయ్యేలా తమిళ భాషలోనూ సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు జేఈఓ వీరబ్రహ్మం.

ఇక అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు టిటిడి సివిఎస్వో శ్రీధర్ తెలిపారు. పంచమి తీర్థం రోజున భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసే షెడ్లలో, క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.

# పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

## ఎమ్ ఇఓఎన్‌వి రమణ




**తొలి సమయం చర్ల, అక్టోబర్ 19**

శనివారం చర్ల మండలంలోని తేగడ జడ్పీ పిఎస్ కలివేరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కి ముఖ్య అతిధిగా చర్ల మండల ఎంఈఓ ఎంవి రమణ పాల్గొనడం జరిగింది. ఎంఈఓ ఎన్ వి రమణ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కలిగి ఉన్నాయని ఉపాధ్యాయులందరూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని వారికి పౌష్టిక ఆహారం అందేలాగా చూడాలని పరీక్షలు సమీపిస్తున్న సమయంలో వారికి ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలని తెలియజేశారు విద్యార్థుల యొక్క ప్రగతిలో తల్లిదండ్రులు బాధ్యత కూడా కీలకమని వారి యొక్క ప్రగతికి భరోసా కల్పించాలని తెలియజేశారు ఇదేవిధంగా ఎంఈఓ ఎన్ వి రమణ చర్ల మండలంలోని సత్యనారాయణపురం ఎంపీపీ ఎస్ గుంపినగూడెం ఎంపీపీ ఎస్ పాఠశాలలను కూడా సందర్శించడం జరిగినది. ఉపాధ్యాయులందరూ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత వచ్చేలా విద్యార్థులకు బోధించాలని సూచించారు అలాగే పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్ అమలును కూడా పరిశీలించడం జరిగినది.

# దండకారణ్యంలో ఐఈడి బాంబు



**తొలి సమయం చర్ల, అక్టోబర్ 19**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లోని నారాయణపూర్ జిల్లాకు చెందిన ఓర్చా, మొహండి ఇరాక్‌భట్టికి చెందిన ఐటిబీపీ, బిఎస్ఎఫ్, డి ఆర్ జి ఉమ్మడి పార్టీ ఆపరేషన్ కోసం ధుర్బెరాకు బయలుదేరింది. 19.10.2024 న, రాత్రి 11:30-12:00 గంటల ప్రాంతంలో, కోడ్లియార్ గ్రామ సమీపంలోని అడవిలో ఐ ఈ డి పేలుడుకు గురైన ఇద్దరు ఐ టి బి పీ జవాన్లు, నారాయణపూర్ జిల్లా పోలీసులోని ఇద్దరు జవాన్లు గాయపడ్డారు . అమరవీరులైన సైనికుల పేర్లు అమర్ పన్వర్ వయస్సు: 36 జిల్లా: సతారా, మహారాష్ట్ర ఐ టి బి పీ 53వ బిఎన్ , కె రాజేష్ వయస్సు: 36 జిల్లా: కడప, ఆంధ్రప్రదేశ్ ఐ టి బి పి 53వ బిఎన్ గాయపడిన మరో ఇద్దరు నారాయణపూర్ జిల్లా పోలీసు సిబ్బంది పరిస్థితి సాధారణంగా ఉంది.

# నేడు కరీంనగర్లో ఎన్‌హెచ్ఆర్‌సి నాయకుల సమావేశం

**తొలి సమయం, కరీంనగర్, అక్టోబర్ 19**

నేడు 20-10-2024 ఆదివారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలో జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కరీంనగర్ జిల్లాలోని పలు విషయాలపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది సుంకనపల్లి రాము, ప్రధాన కార్యదర్శి రాజయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబశివరావు, శ్రీరాముల రమేష్, ఎం.సుధాకర్, రాష్ట్ర ఈసీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, తిరుపతి, అరవింద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల రాజన్న జిల్లాల అధ్యక్షులు పూసాల కృష్ణ, ఎనగందుల వెంకట్, సత్యనారాయణరెడ్డి, అనిల్ రెడ్డి మరియు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం లో విలాసాగరం పృధ్వీ రాజ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇంచార్జ్ 88855 25505, యిమ్మడి ప్రణయ్ న్యాయవాది కరీంనగర్ జిల్లాఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

# డబ్ల్యూజేఐ సభ్యత్వాన్ని తీసుకున్న మొగురం రమేష్

## జర్నలిస్టు సమస్యలపై నిరంతరం పోరాడుతాం

## డబ్ల్యూజేఐ జాతీయ నాయకులు తాడురి కరుణాకర్



**తొలి సమయం కరీంనగర్, అక్టోబర్ 19**

వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ లో శనివారం డబ్ల్యూ జేఐ జాతీయ నాయకులు తాడూరు కరుణాకర్ చేతుల మీదుగా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ తేజ ఎడిటర్ మొగురం.రమేష్ సభ్యత్వన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా తాడూరి కరుణాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం డబ్ల్యూజేఐ పోరాడు తుందని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన సంఘం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టు లంతా డబ్ల్యూజేఐలో చేరి జర్నలిస్టుల ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ సీనియర్ జర్నలిస్టు, నాయకులు, అడేపు లక్ష్మీనారాయణ, డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా నాయకులు టి సత్యనారాయణ, భవాని ప్రసాద్ లు పాల్గొన్నారు

# లక్ష్మీపతి గూడెంలో గాలి కుంట వ్యాధి నివారణకు, టీకాలు

**తొలి సమయం, జిన్నారం, అక్టోబర్ 20**

జిన్నారం మండలం లోని లక్ష్మీపతి గూడెం గ్రామంలో, పాడి పశువులకు, గాలి కుంట నివారణ, టీకాలు వేశారు. పశువైద్యదికారి డాక్టర్ విశ్వ చైతన్య ఆధ్వర్యంలో గోపాలమిత్ర వైద్య సిబ్బంది నరేష్ కుమార్, అనిల్ కుమార్ వ్యాక్సినేషన్ లో రైతులు లక్ష్మీపతి గూడెం గ్రామంలో పాడి పశువుల రైతులు పాల్గొన్నరు ఈ కార్యక్రమం మారో 30 రోజులవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిన్నారం మండల,గ్రామాల ప్రతి ఒక్క,పాడి రైతు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# త్యాగాల చరిత్ర గాంధీ కుటుంబాలది

**- దోపిడీ చేసిన చరిత్ర కెసిఆర్ కుటుటంబానిది**

**- హైడ్రా ఆక్రమణదారుల్లో అంకుశంలా పనిచేస్తోంది - రాజీవ్ సద్భావనా యాత్రలో సిఎం రేవంత్ నిప్పులు**




**హైదరాబాద్,అక్టోబర్ 19:** తెలంగాణను దోపిడీ చేసిన చరిత్రి కేసీఆర్ కుటుంబానిది కాగా, దేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన ఘనత గాంధీ కుటుంబానిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు సైతం అర్పించారని.. అదే విధంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవిని సైతం త్యాగం చేశారని రేవంత్ పేర్కొన్నారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డికి రాజీవ్ గాంధీ సద్భావనా అవార్డును సీఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సమగ్రత కోసం రాజీవ్ గాంధీ 34 ఏళ్ల క్రితం సద్భావన యాత్ర చేపట్టారు. ప్రతి ఏడాది అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వస్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలు అందించిన మాజీ మంత్రి గీతా రెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషంగా ఉంది. రాజకీయాల్లో ఉంటే పదవుల కోసం పాకులాడే వారిని చూశా కానీ గత ఎన్నికల్లో ఏమీ ఆశించకపోగా, పోటీ చేయని గొప్ప వ్యక్తి గీతారెడ్డి' అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే దేశంలో పేదలకు మేలు జరిగింది. పేదలకు మేలు జరిగేది గాంధీకుటుంబంతో మాత్రమే. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని అందరికీ తెలుసు. సోనియా, రాహుల్ గాంధీ ప్రధాని పదవులను త్యాగం చేశారు. గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి ఏమైనా పోలిక ఉందా? అని ప్రశ్నించారు. ఆక్రమణలకు పాల్పడ్డ బడా బాబుల పట్ల భూతం హైడ్రా అని రేవంత్ రెడ్డి అన్నారు. నాళాలు, చెరువులను, ప్రభుత్వ భూములను, ఆక్రమించుకుని పెద్ద పెద్ద బిల్డింగులు, ఫాం హౌస్‌లు కట్టిన వారిపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్రమాలకు పాల్పడిన మదపుటేనుగులను అణచడానికి హైడ్రా అంకుశంలా పనిచేస్తుంద న్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా హైడ్రాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ బిజినెస్ ను సైతం దెబ్బ తీయాలని కుట్ర జరుగుతోందన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని హైడ్రా వారిపై చర్యలు తీసుకుంటుంటే బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డ పడతామంటున్నారు. మూసీ వద్దకు కాదు, జన్వాడ ఫామ్ హౌస్ కు పోదాం. గుల్బాపూర్ నాలాను ఆక్రమించుకుని కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా? అని రేవంత్ ప్రశ్నించారు. ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్.. నీలాంటి వాళ్లు కాదు.. ఫామ్ హౌస్ లో పడుకున్న వాళ్లను రమ్మను, నేను కూడా వస్తా.. నీది ఒక స్థాయేనా అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవనం వేరు, హైడ్రా వేరు. మూసీలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. ట్రాఫిక్ సమస్య, నాళాల పునరుద్ధరణకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రా పనిచేస్తోంది. మీరు చెప్పినట్టు అక్కడికి ఇక్కడికి కాదు, ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్ ల వద్దకు ఎప్పుడు రావాలో అది కూడా హరీష్ రావు చెప్పాలన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ లకు సంబంధించి అఖిలపక్షం పిలిచి, నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు ఏంటో తేల్చేద్దామని పిలుపునిచ్చారు.

# కెటిఆర్, హరీష్‌లు బుద్ధి వుంటే మాట్లాడుతున్నారా?

**- లక్షల కోట్లు దోపిడీ చేసి రోడ్ల మీద పడుతారా**

**- అనేక పథకాల పేరుతో దోచుకుని నీతులు చెబుతారా - మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్,అక్టోబర్ 19:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథ ఇంకా ఏవో పేర్లు చెప్పి 7 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 'మాకు పదేళ్ల కింద 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సమస్య పరిష్కారం అయ్యేది? వాడు తలకాయ ఉండి మాట్లాడుతున్నారా. వంద అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. అరె పిచ్చి కేటీఆర్.. చేసేదే చెప్పాము. మీలాగా అమలు కానీ హామీలు ఇవ్వలేదు. ఎంత కష్టం అయినా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. కేటీఆర్, హరీష్‌కు ఏం పుట్టింది మీకు రాజకీయాలు వస్తాయా.. అసెంబ్లీ, పార్లమెంట్ లో ఓడిపోయిన బీఆర్ఎస్ వాళ్ళు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారు అనుకున్నా.. కానీ సిగ్గు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారు' అంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. నల్గొండలో అనారోగ్యం బారిన పడిన వారు చాలా మంది ఉన్నారని.. ఎన్నో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్‌టీపీలతో సమస్య పరిష్కారం కాదని.. స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని మంత్రి తెలిపారు. ఫ్లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్‌బీసీ అని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, మూసీ శుద్ధీకరణ విషయంలో ముఖ్యమంత్రిని అభినందుస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు ఎ÷-లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీలో 5 వేల కోట్లు దోచుకుతిన్నారని మండిపడ్డారు. కేసీఆర్ కొడుకు అంటే గుర్తు పడతారు కానీ.. కేటీఆర్ అంటే ఎవరూ గుర్తు పట్టరంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారం కోల్పోయినా అహం తగ్గలేదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు తిరిగి వేల కోట్లు సంపాదించి ఎక్కడ పెట్టుకోవాలో తెలియని డబ్బులు సంపాదించారంటూ మండిపడ్డారు. కేటీఆర్.. నల్గొండ మంత్రులు రెచ్చగొడితే రెచ్చి పోరని, స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని స్పష్టం చేశారు. అసలు కేటీఆర్, హరీష్ రావులు నాయకులే కాదని అన్నారు. అన్నింటిలో భాగస్వామ్యాలు ఉన్నాయని.. నారాయణ సంస్థల్లో హరీష్‌కు వాటా ఉందని తెలిపారు. కిషన్ రెడ్డికి ఏమీ తెలియదని.. ఆయన గురించి మాట్లాడం వేస్ట్ అంటూ కామెంట్స్ చేశారు.

ఆయన రాజకీయ నాయకుడు కాదన్నారు. కేటీఆర్, హరీష్ దొంగలని... అందుకే వాళ్ళ విషయాలు అందరికీ తెలియాలని మాట్లాడుతున్నానన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలిసి కాళ్ళు పట్టుకుని మరీ ఇండియాకు రావొద్దని బ్రతిమిలాడినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులకు నల్గొండ వాళ్లంటే ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు. 'విషం పెట్టి చంపండి, లేదంటే మేమే చచ్చి పోతాం' అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీష్ మూసీ ప్రజలను రెచ్చ గొడుతున్నారుని.. వాళ్ళ ఇంటి వద్ద ఎక్కడపడితే అక్కడ శాంతియుత పద్ధతిలో నిరసన చెబుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

# ఐదేళ్ల దోపిడీతో రాష్ట్రం దివాళా

**- మద్యం విధానాలతో దోచుకున్న జగన్**

**- ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు - మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**

**అమరావతి,అక్టోబర్ 19:** ఐదేళ్లపాటు అన్ని రంగాలను దోపిడీ చేసి అప్పులు చేసిన మాజీ సెం జగన్ ఇప్పుడు దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా మాట్లాడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు గుప్పించారు. మద్యం టెండర్లు, ఇసుక రవాణాలో దోపీడీ జరుగుతోందంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అమరావతిలో శనివారం ఆయన మాట్లాడుతూ.. జగన్ ధన దాహంతో రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశారని అన్నారు. కూటమి సర్కార్‌లో పారదర్శకంగా జరిగిన మద్యం విధానంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. 'ఎక్సైజ్ విభాగాన్ని నిర్వీర్యం చేసి వైసీపీ మద్యం పేరుతో దోచుకుంది నిజం కాదా? అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డులేకుండా చేసుకోవడం నిజం కాదా. తయారీ నుండి రిటైల్ అమ్మకాల వరకు అన్ని వ్యవస్థల్ని గుప్పిట్లో పెట్టుకొని ప్రభుత్వ షాపుల పేరుతో దోచుకున్నది నిజం కాదా? జగన్ కల్తీ మద్యం కారణంగా 50 లక్షల మంది కిడ్నీ, లివర్ సమస్యలతో సతమతమయ్యారు. ప్రభుత్వ షాపుల్లోనే వేలాది పసూ ఉల్లంఘనలు జరగడంపై ఏం సమాధానం చెబుతావు? ఎన్నడూ లేని విధంగా 2019-24 మధ్య అక్రమ మద్యం రవాణా కేసులు ఎందుకు ఎక్కువగా నమోదయ్యాయి? వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు నీతులు చెప్పడానికి సిగ్గు పడాలి. రాష్ట్ర ఖజానాకు ఆదాయం తగ్గించి.. మీ ఆదాయం పెంచుకోవడం నిజం కాదా? కూటమి అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా ఉన్న మద్యాన్ని ఏపీలో అందుబాటులో ఉంచేలా పాలసీ తీసుకొచ్చాం అన్నారు. రూ.99 కే క్వార్టర్ అందించే ప్రయత్నం చేస్తున్నాం. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి ధరల్ని నిర్ణయించబోతున్నాం. నీతులు చెప్తున్న జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన మద్యం అక్రమాలపై చర్చకు సిద్ధమా? కల్లు గీత కార్మికులకు కేటాయించిన షాపులకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తాం. అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరిగింది. ప్రభుత్వంపై నమ్మకంతో 89,882మంది దరఖాస్తు చేసుకుని, దుకాణాలు ఏర్పాటు చేశారు. పునరావాసం కోసం అదనంగా 2 శాతం సెస్ అమలు చేస్తున్నాం. ఆదాయం పోయిందనే బాధతో జగన్ రెడ్డి దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు ఊరుకోరు అని గుర్తుంచుకోండి. ఇసుక మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకొని దోచుకున్న ఘనత జగన్ రెడ్డికే చెందుతుంది. జగన్ రెడ్డి ఇసుక మాఫియా కారణంగా 70 మంది భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రజా ధనాన్ని జగన్ బినామీ కంపెనీలతో కలిసి దిగమింగారు. మీ అక్రమాల కారణంగానే ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా విధించింది.

# గ్రూప్-1 అభ్యర్థులను చర్చలకు పిలవరా?

**రేవంత్ రెడ్డి కావాలనే డ్రామాలు ఆడుతున్నారు**

**రైతుభరోసా ఇవ్వనందుకు నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వెల్లడి**



**హైదరాబాద్,అక్టోబర్ 19:** గ్రూప్-1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం హీనంగా చూస్తోందని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.... గ్రూప్-1 అభ్యర్థులు ఈ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాతలు అని చెప్పారు.కనీసం సుప్రీంకోర్టు ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకైనా ప్రభుత్వం వేచి చూడాలని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే డ్రామా ఆడుతున్నారని విమర్శించారు.. బండి సంజయ్‌ని పోలీస్ సెక్యూరిటీ ఇచ్చి మరి రేవంత్ ర్యాలీ చేయిస్తాడని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను మాత్రమే రేవంత్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని మండిపడ్డారు. బండి సంజయ్‌ను చర్చలకు పిలిస్తే ఏం జరుగుతుందని కేటీఆర్ అడిగారు. బండి సంజయ్ ఏం చదువుకున్నాడు? ఆయనకు పరీక్షల గురించి ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. పరీక్ష పత్రాలు లీక్ చేయమంటే చేస్తాడు... అభ్యర్థుల తరపున ఆయనేం చర్చిస్తారని నిలదీశారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతు భరోసా ఇస్తానని రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఒక్క పంట కూడా రైతు భరోసా ఇవ్వకుండా చేతులె త్తేశారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ విషయం గురించి ముందే చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకే రైతు బంధు అని చెప్పారని అలాగే జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి రైతు భరోసా ఎందుకు వేయడం లేదని నిలదీశారు. ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా ఇవ్వనందుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# పివి సింధుకు మరో ఏడాది పాటు వెసలుబాటు

**ఆన్‌డ్యూటీ కాలాన్ని పొడిగించిన ప్రభుత్వం**

**అమరావతి,అక్టోబర్ 19:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని మరో ఏడాది పొడిగించింది. ఆసియా, కామన్‌వెల్త్ క్రీడలతో పాటు 2025-26లో వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ నిమిత్తం పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని పొడిగించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓడీని పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు 2016 ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో అప్పటి తెలుగు ప్రభుత్వాలు పీవీ సింధును ఘనంగా సన్మానించడంతో పాటు నజరానా ప్రకటించాయి. గ్రూప్-1 హోదాతో ప్రభుత్వ ఉద్యోగం కూడా ఆఫర్ చేశాయి. అయితే ఏపీలో ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు పీవీ సింధు సుముఖత వ్యక్తం చేశారు. తొలుత విజయవాడ గొల్లపూడిలోని ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలో పీవీ సింధు విధుల్లో చేరారు. డిప్యూటీ కలెక్టర్ విధులు, బాధ్యతలపై శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న లేక్‌వ్యూ అతిథిగృహంలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు.

# గ్రూప్ -1 మెయిన్స్ కోసం పటిష్ఠ బందోబస్తు

**హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాట్లు: డిజిపి**

**హైదరాబాద్,అక్టోబర్ 19:** గ్రూప్ -1 మెయిన్స్ కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ జితేందర్ వెల్లడించారు. పరీక్షకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు ఆదేశాల ప్రకారమే పరీక్షలకు జరుగుతాయని, నిరసన పేరుతో రోడ్లపైకి వచ్చి ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాలపై అభ్యంతరాలుంటే సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంయమనం పాటించాలని కోరారు. సికింద్రాబాద్ ఘటనపైనా ఆందోళనలు చేయడం సరికాదన్నారు. తెలంగాణలో అక్టోబరు 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించనున్నట్లు డీజీపీ వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి నివాళులర్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని, తెలంగాణకు చెందిన ఓ పోలీసు అధికారి కూడా అమరులయ్యారని తెలిపారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101